క్లుప్తంగా

స్పీడ్‌బ్రేకర్లు తొలగించండి



వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్లు

జగిత్యాల: పట్టణంలోని ప్రధాన రహదారిపై గల స్పీడ్ బ్రేకర్లతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటిని వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాన రహదారిపై స్పీడ్ బ్రేకర్ల నిర్మాణంతో ఆస్పత్రికి వచ్చే గర్భిణులు, స్కూల్‌కు వెళ్లే వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, స్పీడ్ బ్రేకర్లను వెంటనే తొలగించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తోట మల్లికార్జున్, జగదీశ్, రాంకుమార్, రాజేశ్, బద్దం లత, మోహన్‌రెడ్డి, రేణుక పాల్గొన్నారు.

విద్యార్థులకు రాగిజావ పంపిణీ



రాగిజావ అందజేస్తున్న ఇన్‌చార్జి ఎంఈవో

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కర్ణాటక చిక్కబల్లాపూర్‌కు చెందిన శ్రీసత్య సాయి అన్నపూర్ణ ట్రస్ట్ వారు పాఠశాలకు ఉచితంగా రాగిజావ అందజేశారు. ఈ మేరకు బుధవారం ఇన్‌చార్జి ఎంఈవో ఆనందరావు పంపిణీ చేశారు. ఉపసర్పంచ్ మంగినిపెల్లి లక్ష్మణ్, ప్రధానోపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, పీఈటీ కృష్ణప్రసాద్, ఉపాధ్యాయులు రాజేందర్, మురళి, ఇమాన్యుయల్, మమత, లక్ష్మి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

వంద పడకలకు అప్‌గ్రేడ్ చేయాలి

మెట్‌పల్లి: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిని వంద పడకలకు అప్‌గ్రేడ్ చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ అప్‌గ్రేడ్ చేయకపోవడం సరికాదన్నారు. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గురువారం ఆసుపత్రికి వస్తున్న మంత్రి హరీశ్‌రావు దృష్టికి అధికారులు ఈ విషయాన్ని తీసుకెళ్లాలని ఆయన సూచించారు. సమావేశంలో నాయకులు రాజు, అందె మారుతి, గోరుమంతుల ప్రవీణ్, చైతన్య, రఘు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై సతీశ్‌కుమార్

కోరుట్లరూరల్: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సతీశ్‌కుమార్ సూచించారు. ఈ మేరకు మండలంలోని కల్లూరు శివారులో గల కస్తూర్బాగాంధీ పాఠశాలలో బుధవారం పలు అంశాలపై విద్యార్థినులకు ఎస్సై అవగాహన కల్పించారు. డయల్ 100, అబ్బాయిల నుంచి రక్షణ, పోకిరీలతో ఎదురయ్యే సమస్యలు అధిగమించడం, చదువులో ఉన్నత లక్ష్యాలను చేరుకోవటం, వ్యక్తిత్వ వికాసం తదితర అంశాలపై ఎస్సై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ వనతడుపుల అంజయ్య, పాఠశాల ఇన్‌చార్జి శిరీష, పంచాయితీ కార్యదర్శి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీ చేపట్టాలి

కొడిమ్యాల: మండల కేంద్రంలో తెలంగాణ ప్రాంత సంఘం (తపస్) 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం తహసీల్దార్ స్వర్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని, స్కావెంజర్లను నియమించాలని, ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలని, డీఏ బకాయిలు విడుదల చేయాలని, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముమ్మడి హరికృష్ణ ప్రసాద్, ఏనుగు ఆదిరెడ్డి, జిల్లా బాధ్యులు నాంపెల్లి మల్లేశం, వీరమల్ల వెంకట రమణరావు, గోనేపల్లి శ్రీనివాస్, గుడి భూపతి రెడ్డి, ఎర్రోజు మోహనాచారి పాల్గొన్నారు.

అల్పాహారానికి విరాళం

గొల్లపల్లి: పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల సమయంలో అల్పాహారం అందించడం కోసం మల్లన్నపేట మల్లికార్జున దేవస్థానం ఫౌండరి ట్రస్టీ శాంతయ్య ఎంఈవో జమునాదేవికి విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఏంఈవో, ఉపాధ్యాయులు పాఠశాల తరపున ధన్యవాదాలు తెలిపారు. ఉపాధ్యాయులు బైర్నేని రమణరావు పాల్గొన్నారు.

డబుల్‌బెడ్రూం ఇళ్లు పూర్తయ్యేదెన్నడు?

- ఐదేళ్లుగా కొనసాగుతున్న ఇళ్ల నిర్మాణం
- ఇంకా పూర్తికాని వైనం
- ఎదురుచూస్తున్న లబ్ధిదారులు
- నిర్మించిన సగం ఇళ్ల గోడలకు పెచ్చులూడుతున్న దుస్థితి



నిర్మాణ దశలోనే ఉన్న ఇళ్లు

మేడిపెల్లి: పేదవారి సొంతింటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్‌బెడ్రూం ఇళ్ల కోసం నిరుపేదలకు ఎదురు చూపులు తప్పడం లేదు. శంకుస్థాపనలు చేసి ఏళ్లు గడుస్తున్నప్పటికీ పనులు నత్తనడకన కొనసాగుతుండడంతో లబ్ధిదారులను ఆవేదనకు గురిచేస్తోంది. మండల కేంద్రంలో ఐదేళ్లుగా పనులు కొనసాగుతుండటంతో పనులు పూర్తయ్యేనా.. తమ సొంత ఇంటి కల నేరవేరేనా అని లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఐదేళ్లవుతున్నా.. పూర్తికాని నిర్మాణం

మండల కేంద్రంలోని ఎస్సారెస్పీ కెనాల్ పక్కన ఉన్న సుమారు ఐదెకరాల స్థలంలో 2017 జూన్ 1న 15 డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు శంకుస్థాపన చేశారు. దీనికి గాను రూ.75లక్షలు కేటాంచారు. పనులు ప్రారంభించి ఐదేళ్లు గడుస్తున్నప్పటికీ నేటికీ ఒక్క ఇంటి నిర్మాణం కూడా పూర్తి కాలేదు.

నాణ్యత లోపం..పెచ్చులూడుతున్న ఇళ్లు

15 డబుల్‌బెడ్రూం ఇళ్లలో సగానికి పైగా ఇళ్ల నిర్మాణాలు చివరి దశకు చేరుకున్నాయి. కాగా ఏళ్ల కిందట సగం నిర్మించిన ఇళ్లు అలాగే వదిలివేయడంతో ప్రస్తుతం అక్కడ చెట్లు, ముళ్లపొదలు దర్శనమిస్తున్నాయి. మరికొన్ని ఇళ్లు పెచ్చులూడిపోయి నాణ్యత లోపాలు బయట పడుతున్నాయి. కాగా ఇళ్లకు వాడే మెటీరియల్ ధరలు పెరిగిపోవడం, చేసిన పనులకు బిల్స్ రాకపోవడంతో పనులు ఆగిపోయినట్లు తెలుస్తోంది.

ఎదురుచూస్తున్న లబ్ధిదారులు..

శంకుస్థాపన అనంతరం 2018లోనే లక్కీ డ్రా ద్వారా 15 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఐదేళ్లు గడుస్తున్నా ఇళ్ల నిర్మాణాలు పూర్తికాకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

సొంత ఇల్లు లేదు



నాకు ఇద్దరు ఆడపిల్లలు. కూలీ పనిచేస్తాను. మాకు సొంత ఇల్లు లేదు. ఐదేళ్ల కిందట డబుల్‌బెడ్రూం ఇస్తామంటే సంబరపడ్డాం. కానీ ఇప్పటికీ పూర్తి కాలేదు. పనిచేసే డబ్బులు అద్దెకే పోతున్నాయి. ఇల్లు త్వరగా పూర్తిచేయాలి.

– పొట్లపెల్లి లావణ్య, లబ్ధిదారు

బిల్లులు సరిగా రాక..



పనుల బిల్లులు సరిగా రాక పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. తగిన చర్యలు తీసుకుంటాం. కాంట్రాక్టర్‌తో మాట్లాడుతున్నాం. ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చూస్తాం.

– విజయ్, ఏఈ, పంచాయతీరాజ్, మేడిపెల్లి

గిరిజన తండాల్లో మౌలిక వసతులపై సర్వే



సర్వే నిర్వహిస్తున్న గిరిజనశాఖ అధికారులు

సారంగాపూర్: గిరిజన ఆవాసాలు, తండాల్లో మౌలిక వసతులపై గిరిజన శాఖ ఆధ్వర్యంలో బీర్‌పూర్ మండలంలోని వివిధ గిరిజన గ్రామాలు, తండాల్లో బుధవారం సర్వే నిర్వహించారు. బీర్‌పూర్ మండలంలోని చిత్రవేణిగూడెం, కందెనకుంట, నాయికపుగూడెం, ఆసునూరిగూడెం, బీర్‌పూర్ ఎస్టీ కాలనీ, నాయికపుగూడెం, మంగేళ గోండు గూడాల్లో సర్వే నిర్వహించారు. గిరిజన ఆవాసాలకు రహదారి కనెక్టివిటీ, మౌలిక సదుపాయాలు, ప్రస్తుత స్థితి, తీసుకోవాల్సిన చర్యలపై క్షేత్రస్థాయిలో ఉమ్మడి జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆదేశాలతో ఈ సర్వే నిర్వహించారు. రాష్ట్రస్థాయి గిరిజన సంక్షేమ శాఖ చీఫ్ ఇంజనీర్ ఆధ్వర్యంలో 20 బృందాలు రాష్ట్ర స్థాయిలో సర్వే నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సర్వేలో డీఈ మధుకర్, ఉపాధ్యాయులు బిజిలి రవీందర్, బానోతు బికన్, ఇస్లావత్ రాజునాయక్ పాల్గొన్నారు.

కోనోకార్పస్ మొక్కలను తొలగించాలి



వినతిపత్రం సమర్పిస్తున్న కౌన్సిలర్లు

ధర్మపురి: పర్యావరణానికి ముప్పు కలిగిస్తున్న కోనోకార్పస్ మొక్కలను వెంటనే తొలగించాలని కోరుతూ కాంగ్రెస్ కౌన్సిలర్లు బుధవారం మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కు వితనిపత్రం సమర్పించారు. హరితహారంలో భాగంగా ధర్మపురితో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో కోనోకార్పస్ మొక్కలు ఏర్పాటు చేశారని, ఈ మొక్కలతో మానవులు, జంతువులకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. అంతేకాకుండా నాటిన మొక్కలు చెట్లగా మారి ఇల్లు, డ్రైనేజీలు, డివైడర్లలోకి చొచ్చుకుపోయి ప్రమాదకరంగా మారుతున్నాయని, మనుషులు అనారోగ్యాల పాలవుతున్నారని కౌన్సిలర్లు నాగలక్ష్మి, జక్కు పద్మ, సంతోషి, పద్మ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు.

వందశాతం హాజరైన విద్యార్థులకు బహుమతి



బహుమతి ప్రదానం చేస్తున్న హెచ్‌ఎం

కథలాపూర్: మండలంలోని బొమ్మెన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వందశాతం హాజరైన విద్యార్థులకు బుధవారం బహుమతి ప్రదానం చేశారు. విద్యార్థుల్లో హాజరు శాతం పెంచాలనే ఉద్దేశంతో ప్రతినెలా విద్యార్థుల హాజరును పరిశీలిస్తున్నట్లు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. పాఠశాలలో 125 మంది విద్యార్థులుండగా డిసెంబర్‌లో 30 మంది విద్యార్థులు 100శాతం హాజరైనట్లు గుర్తించామన్నారు. వీరికి బహుమతి ప్రదానం చేశారు. హెచ్‌ఎం అంబటి రవి, ఉపాధ్యాయులు సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

కథలాపూర్: గ్రామాల్లో ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై రామచంద్రం పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని అంబారిపేట జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. సెల్‌ఫోన్‌ను అవసరాలకు వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. అపరిచితుల వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వేముల గంగరాజం, హెచ్‌ఎం మార్గం రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦రేపు మండల సర్వసభ్య సమావేశం

కోరుట్లరూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నీరజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

✦ఆప్షనల్ సెలవుల అమలుపై వినతి

సారంగాపూర్: ప్రభుత్వం ప్రతీ విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయులకు ఇచ్చే 5 ఆప్షనల్ సెలవులను ఏరోజు ఏ పండుగలకు ఇవ్వాలన్న దానిపై బుధవారం బీర్‌పూర్ మండలంలోని వివిధ ఉపాధ్యాయ సంఘాలు ఎంఈవోకు వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు మండలంలోని టీపీయూఎస్, టీఆర్‌టీఎఫ్, టీపీటీఎఫ్, ఎస్‌టీయూ ఉపాధ్యాయ సంఘాలు ఎంఈవో వాసం భీమయ్యకు వినతిపత్రం సమర్పించారు.

✦నిత్యావసరాలు అందజేత

మల్లాపూర్: మండలంలోని చిట్టాపూర్ గ్రామంలో నిరుపేద వృద్ధురాలు గుజ్జరి రాజవ్వకు బుధవారం మెట్‌పల్లికి చెందిన పూదరి రేవంత్‌గౌడ్ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని 25కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. పూదరి రాము, శ్రీనివాస్‌గౌడ్, సామాజిక కార్యకర్త విష్ణువర్ధన్‌రాజు, రాంప్రసాద్, శేఖర్, రఘు పాల్గొన్నారు.

✦తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

కథలాపూర్: కథలాపూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని కోరుట్ల ఆర్డీవో వినోద్‌కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను తనిఖీ చేసి భూమి సమస్యలపై వచ్చిన దరఖాస్తులను ఏ మేరకు పరిష్కరించారనే విషయంపై అధికారులతో చర్చించారు. ఆయన వెంట తహసీల్దార్ రవీందర్ ఉన్నారు.

✦పీహెచ్‌సీ వైద్యునికి సన్మానం

మెట్‌పల్లి: మండలంలోని జగ్గాసాగర్ గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యునిగా బాధ్యతలు చేపట్టిన అంజిత్‌రెడ్డిని బుధవారం గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పుల్లా జగన్, పిడుగు శ్రీనివాస్, చిన్నా అంజయ్య, బోగ గంగాధర్, కొమ్ము రవీందర్, గంగారెడ్డి, రఘు, శ్రీనివాస్ ఉన్నారు.

✦అర్హులకే 'డబుల్' ఇళ్లు కేటాయించాలి

జగిత్యాలటౌన్: పట్టణ పరిధిలోని అర్హులైన నిరుపేదలకే డబుల్‌బెడ్రూం ఇళ్లు కేటాయించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు మహంకాళి రాజన్న కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో రాజన్న మాట్లాడుతూ నూకపెల్లి అర్బన్ హౌజింగ్ కాలనీలో నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్ల కేటాయింపులో అవకతవకలు జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు.

✦గొర్రెలను ఎత్తుకెళ్లిన దొంగలు

కథలాపూర్: మండలంలోని రాజారాం తండాలో తిరుపతినాయక్ అనే వ్యక్తికి చెందిన రెండు గొర్రెలను దొంగలు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు బుధవారం తెలిపారు. ఈ విషయంలో బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ఇబ్రహీంపట్నం: పీఆర్‌టీయూటీఎస్ 2023 క్యాలెండర్‌ను మెట్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూటీఎస్ మండల అధ్యక్షుడు మద్దిరాల గణేశ్, ప్రధాన కార్యదర్శి జంగిలి అశోక్, అసోసియేట్ అధ్యక్షుడు కొడకండ్ల రామకాంత్, కార్యదర్శి ఉలిసె వెంకటేశ్వర్‌రావు, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఈగ శ్రీధర్‌కుమార్, డిస్ట్రిక్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మార్గం రాజేందర్, మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె సత్యనారాయణ పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

కోరుట్లరూరల్: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం ఎంఈవో గంగుల నరేశం ఆవిష్కరించారు. ప్రధానోపాధ్యాయులు గడీల భూపతి, టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు చింత మోహన్ ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు చింత సత్య ప్రకాష్, సంజీవరాణి, లక్ష్మీనర్సయ్య, రాజయ్య, నాగరాజు, రమేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏకాదశ రుద్రాభిషేకం



రుద్రాభిషేకం నిర్వహిస్తున్న వేదపండితులు

మల్లాపూర్: మండల కేంద్రంలోని సోమేశ్వర కొండపైన గల శ్రీకనకసోమేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ధర్మపురి గాయత్రీ నిత్య అన్నదాన బ్రాహ్మణ సత్రం ఆధ్వర్యంలో వేదపండితులు ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో బ్రాహ్మణులు బొజ్జ కిష్టయ్య (పెద్ద), బొజ్జ దత్తాత్రి, బొజ్జ శంకర్, బొజ్జ కిష్టయ్య(చిన్న), కందల అంబారీశచారి, కొరిదె శంకర్, కొరిదె సత్యనారాయణ, బావి మురళి, కాశొజ్జల రాజేశ్వర్, తాడూరి బలరాం, రామకిషన్, వామనబంట్ల చంద్రమౌళి, పెండ్య రవీందర్, చంద కిషన్ పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

కొడిమ్యాల: మండలంలోని హిమ్మత్‌రావుపేట అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పునుగోటి కృష్ణారావు చిన్నారులకు అక్షరాభ్యాసం చేసి బాలామృతం, పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ లతశ్రీ, అంగన్‌వాడీ సిబ్బంది రాజమణి, సుశీల, వైద్య సిబ్బంది రాజశ్రీ, పద్మ పాల్గొన్నారు.

వార్డుకు నిధులు కేటాయించాలి



అసంపూర్తిగా డ్రైనేజీ నిర్మాణం

జగిత్యాల: పట్టణంలోని 35వ వార్డుకు టీయూఎఫ్ఐడీసీ నిధులు కేటాయించలేదని, వెంటనే కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రవికి వార్డు కౌన్సిలర్ జయశ్రీ వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక్కో వార్డుకు రూ.20లక్షల చొప్పున నిధులు కేటాయించారని, ప్రతిపక్ష కౌన్సిలర్ వార్డుల్లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని, వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. కొత్త కౌన్సిల్ వచ్చి మూడేళ్లు అవుతున్నా కేవలం రూ.5 లక్షలు కేటాయించారని, డ్రెయినేజీ పూర్తిస్థాయిలో కట్టకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అటెన్షన్ ప్లీజ్



పాఠశాల భవనం ప్రారంభించండి..

పెగడపల్లి: మండల కేంద్రమైన పెగడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన అదనపు తరగతుల భవనం ప్రారంభం కోసం విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. విద్యార్థులకు సరిపడా గదులు లేక విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యను మంత్రి ఈశ్వర్ దృష్టికి తీసుకెళ్లగా డీఎంఎఫ్‌టీ నిధులు రూ.73లక్షలు కేటాయించారు. ఈ నిధులతో నిర్మాణ పనులు పూర్తయ్యాయి. సంబంధిత అధికారులు పాఠశాల భవనం ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి పేరు: అయిత శ్రీనివాస్, మండల విద్యాధికారి

ఫోన్ నంబర్: 92468 95051

తపాలా బీమా పథకాలను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

రాయికల్: నిరుపేదలు ఆర్థికంగా వృద్ధి సాధించేందుకు తపాలా ఆధ్వర్యంలో చేపడుతున్న బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కరీంనగర్ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు బుధవారం రాయికల్ తపాలాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని రాయికల్, ముత్యంపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన మేళాలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సుకన్య సమృద్ధి, ఉద్యోగులకు బీమా, ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి యోజన, టైం డిపాజిట్, కిసాన్ వికాస పథకం, ఆడపిల్లల కోసం సుకన్య సమృద్ధి యోజన పథకాలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట వెస్ట్ సబ్ డివిజన్ ఐపీవో శ్రావణ్, రాయికల్ ఎస్‌పీఎం మనోజ్ పాల్గొన్నారు.

బైరి నరేశ్‌పై చర్యలు తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

ధర్మపురి: కొన్నిరోజుల క్రితం జరిగిన ఒక సభలో హిందూ మతాన్ని కించపరిచే విధంగా అయ్యప్ప స్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేశ్‌పై చర్యలు తీసుకోవాలని బుధవారం పలువురు నాయకులు అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఎంపీపీ చిట్టిబాబు, కౌన్సిలర్ తరాల కార్తీక్, అనంతుల లక్ష్మణ్, కడారి గంగాధర్, ఆవునూరి శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఎంపీ అర్వింద్ పర్యటన విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న పడాల తిరుపతి

రాయికల్: నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ 6న రాయికల్‌లో పర్యటించున్నందున కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని బీజేపీ నాయకుడు పడాల తిరుపతి కోరారు. ఈ మేరకు బుధవారం మండలంలోని రామాజీపేట, భూపతిపూర్ గ్రామాల్లో బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలంతా ఐకమత్యంగా ఉంటూ పార్టీ పటిష్టతకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వేణు, సింగిల్‌విండో చైర్మన్ ఏనుగు ముత్యంరెడ్డి, రాష్ట్ర నాయకులు లక్ష్మీనారాయణ, ఎంపీటీసీ ఆకుల మహేశ్, నాగరాజు, నందు, కోల శంకర్, సంకోజి శేఖర్, రాయికల్ మాజీ సర్పంచ్ మచ్చ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ

మల్లాపూర్: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో బుధవారం మెడికల్ అధికారిగా డాక్టర్ వాహిని బాధ్యతలు స్వీకరించారు. మల్లాపూర్ పీహెచ్‌సీ మెడికల్ అధికారి డాక్టర్ ఏనుగు రాకేశ్ బదిలీపై నిజామాబాద్ జిల్లా పోచంపాడ్‌కి వెళ్లగా, మల్లాపూర్ పీహెచ్‌సీ మెడికల్ అధికారిగా డాక్టర్ వాహినిని నియమించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆమె రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీనివాస్, ఇందిర, ల్యాబ్ టెక్నీషియన్ ఉమాదేవి, స్టాఫ్‌నర్సు సుమ పాల్గొన్నారు.

'డబుల్' దరఖాస్తులకు 8 వరకు గడువు

జగిత్యాలరూరల్: పట్టణంలోని అర్హులైన పేద ప్రజలు డబుల్‌బెడ్రూం ఇళ్ల కోసం 8వ తేదీ వరకు మీసేవా కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని జగిత్యాల తహసీల్దార్ ఆరీఫొద్దీన్ తెలిపారు.

బీజేపీ కార్యకర్తల సమావేశం

ధర్మపురి: పట్టణంలోని కర్నె అక్కపెల్లి కల్యాణ మండపంలో బుధవారం బీజేపీ అసెంబ్లీ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ధర్మపురి అసెంబ్లీ కన్వీనర్ కస్తూరి సత్యం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 7న బీజేపీ రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు బూత్‌స్థాయి కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పిల్లి శ్రీనివాస్, బెజ్జారపు లవన్, బండారి లక్ష్మణ్, ఓరుగంటి చంద్రశేఖర్, సూర్యనారాయణ, మంచె రాజేశ్ పాల్గొన్నారు.

సైడ్ డ్రైన్ పనులు ప్రారంభం

గొల్లపల్లి: మండలంలోని భీంరాజ్‌పల్లి గ్రామంలో సర్పంచ్ రేవెల్లి సత్యనారాయణగౌడ్ సైడ్ డ్రైన్ పనులు ప్రారంభించారు. ఉపసర్పంచ్ దూస రవి, ఫీల్డు అసిస్టెంట్ నరేందర్, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పుపై సమావేశం



మాట్లాడుతున్న మున్సిపల్ అధికారులు

కోరుట్ల: పట్టణం నుంచి అయిలాపూర్ వెళ్లే రహదారిని వెడల్పు చేసేందుకు బుధవారం మున్సిపల్ అధికారులు రోడ్డుకు ఇరువైపులా ఉన్న భవన యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ రోడ్డును రవాణా సౌకర్యం కోసం 60ఫీట్ల రోడ్డుగా విస్తరిస్తామని, భవన యజమానులు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. రోడ్డు విస్తరణ కోసం భవనాలు కూల్చివేస్తున్నందున తమకు ఒక నెల అవకాశం ఇవ్వాలని భవన యజమానులు మున్సిపల్ అధికారులను కోరగా ఇందుకు వారు అంగీకరించారు. పట్టణ ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు, టీపీఎస్ రమ్య, తదితరులు పాల్గొన్నారు.